

రమణశ్రీ

# బొమ్మా-బొరుసు

## ప్రభాకర్

నిర్మల నా అనురాగ రాశి, ప్రేమదేవత, హృదయరాజ్ఞి అనుకున్నాను ఒకరోజు. అలా ప్రతి రోజు అనుకోవాలనుకున్నానుగూడా! అన్నట్లు అసలు నిర్మలతో నా పరిచయం చెప్పకుండా మిగిలిన విషయాలు చెబితే అది అసంపూర్తి కథే అవుతుంది.

మేం ఆ వాటాలోకి అద్దెకొచ్చేటప్పటికి ప్రక్క వాటా ఖాళీగానే వుంది. దాదాపు అయిదు నెలల తర్వాతనుకుంటా, ఆ వాటాలోకి ఎవరో వచ్చారు. ఆ రాత్రి భోంచేస్తున్నప్పుడు అమ్మ చెప్పింది 'వాళ్ళు మనవాళ్ళేరా' అని. ఆవిడకు మడీ ఆచారం ఎక్కువ. ఇరుగు పొరుగు తనవాళ్ళయితే ఆ ఆచారానికి విఘాతం కలగదని ఆవిడ అభిప్రాయం. ఆ తరువాత ఆదివారం తీరిగ్గా యింటివద్ద కూర్చొన్నప్పుడు ప్రక్కవాటాలో ఓ 'మెరుపు' వున్నట్లు పసిగట్టాను. నాముందు తళుక్ తళుక్‌మంటూ రెండుసార్లు మెరిసింది కూడా ఆ మెరుపు.

గదిలో కూర్చొని ఆఫీసులో మిగిలిపోయిన డ్రాఫ్టింగ్ పూర్తి చేసుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా గదిలోకి దూసుకువచ్చింది మెరుపు. నన్ను చూసి క్షణకాలం నిర్ఘాంతపోయి 'సారీ,

# బొమ్మా – బొరుసు

అత్తయ్యగారున్నారనుకున్నాను' అంటూ తళుక్కున మాయమైంది.

మెరుపు మాటలు రసగుల్లాలుకన్న తీయగా వున్నాయి. ఆమె 'అత్తయ్యగారు' అని అన్నది మా అమ్మనే అనుకునేసరికి నా వూహాలు తెలుగు సినిమాలోని కలల సీనులోకి వెళ్ళిపోయాయి.

మరోసారి నేను ఆఫీసునుండి యింటికి వచ్చే టప్పటికి అమ్మతో బాతాఖానీ కొడుతూ కన్పించింది మెరుపు. నన్ను చూడగానే చటుక్కున లేచి నిలబడింది.

"అరె! అలా నిలబడిపోయారేమిటి? కూర్చోండి. ఫర్వాలేదు" ఎక్కడ మాయమైపోతుందోనని కంగారుగా అన్నాను.

కూర్చోలేదు. "అత్తయ్యగారూ, వెళ్ళొస్తానండీ" అంది నేల చూపులు చూస్తూ.

నవ్వాను నేను. "నేను మీ అత్తయ్యగారి అబ్బాయినే నా పేరు ప్రభు" అన్నాను.

చురుగ్గా నా కళ్ళలోకి చూసి చటుక్కున మాయమయిందా మెరుపు.

ఆ మెరుపు పేరు నిర్మల అని తెలుసుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు నాకు.

ఆ తరువాత చాలామంది యువతీ యువకులు దగ్గరైనట్లే మేమూ దగ్గరయ్యాము, పుస్తకాల దగ్గర!

మా ఆఫీసులో దాదాపు పదిమంది స్త్రీలు పని చేస్తున్నారు. అందులో ఆరుగురు అవివాహితులే! అయినా నా దృష్టిని నిర్మల ఆకర్షించినంతగా మరెవ్వరూ ఆకర్షించలేదు దానికి నిర్మల అంద చందాలేగాక ఆమె నడక ప్రత్యేక కారణం అని చెప్పకోవచ్చు. అన్ని అవయవాలు సమపాళ్ళలో పోత పోసినట్లుండే నిర్మల నడుస్తుంటే ఏ అప్సరసో శాపవశాత్తూ దివినుండి భువికి వచ్చి వుండవచ్చనిపిస్తుంది

నిర్మల అప్పుడప్పుడే పేరు తెచ్చుకుంటున్న నాట్యకత్తె – భరతనాట్యంలో ప్రవీణురాలేగాక చిన్న స్కూల్ ప్రారంభించి ఓ పదిమంది పిల్లలకు భరత నాట్యం కూడా నేర్పుతోంది.

క్రమేపీ మా అమ్మ లేకపోయినా నిర్మల మా యింటికి వస్తూ పోతూనే వుంది ఆదివారంపూట గంటల తరబడి నవలలమీదా, సినిమాలమీద మాట్లాడుకొనేవాళ్ళం నాకు పెద్దగా పుస్తకాలు చదివే అలవాటు లేకపోయినా నిర్మల కోసం మా ఆఫీసు లైబ్రరీకొచ్చే ప్రతిపుస్తకాన్ని విధిగా పట్టు కొచ్చేవాడిని నిర్మలకూడా వూరుకునేదికాదు తను ప్రదర్శన యిచ్చే ప్రతి కార్యక్రమానికి ఆహ్వానం యిచ్చి విధిగా రమ్మని శాసించేది.

నిర్మలతో పరిచయం వృద్ధి అవుతున్నకొలదీ నా హృదయ స్పందనం పెరగనారంభించింది మదిలో ఆలోచనలు సుళ్ళు తిరగడం ప్రారంభించాయి. చివరకు ఒకరోజు నిర్మల కన్పించకపోతే పిచ్చెత్తి పోయినట్లనిపించే స్థితికి చేరాను. అయితే నిర్మలలో ఆ భావమేమీ వున్నట్లు కన్పించేది కాదు స్వచ్ఛంగా నవ్వేది చిన్నపిల్లలా మాట్లాడేది నేను అర్థంకాని సంక్షోభంలో చిక్కుకున్నాను

పుస్తకాలు యిస్తూ అప్పుడప్పుడు చేతి వ్రేళ్ళు తగిలించేవాడిని. అయినా నేను ఆశించే 'రియాక్షన్' నిర్మలలో కన్పించేది కాదు ఇక ఉండబట్టలేక పోయాను. ఓ రోజు పుస్తకాలు ఇస్తూ చటుక్కున రెండు చేతులూ పట్టుకున్నాను ఉలిక్కిపడి నా కళ్ళలోకి చూసింది నిర్మల.

"ఐ లవ్ యూ నిర్మలా" అన్నాను ఉద్వేగంగా.

సమాధానం చెప్పకుండా చేతులు విడిపించుకొని మౌనంగా వెళ్ళిపోయింది ఆ క్షణంలో 'ఛ, ఎందుకలా ప్రవర్తించానా' అన్పించింది. ఇక నిర్మలతో అదే చివరి సంభాషణ అనుకున్నాను ప్రతిరోజూ మేం మాట్లాడుకొనే మేడమీదకు వెళ్ళి దిగులుగా కూర్చున్నాను.

ఇంతలో వూహించని మెరుపులా వచ్చింది నిర్మల

"సారీ నిర్మలా, అనుకోకుండా."సంజాయిషీ చెప్పబోయాను.

నవ్వింది నిర్మల. కలువపూవు నవ్వితే, విండు జాబిలి నవ్వితే, పండువెన్నెల నవ్వితే ఎలావుంటాయో తెలియదుగానీ, నిర్మల నవ్వితే అవన్నీ గుర్తుకు వస్తాయి.

"ఫర్వాలేదు. అసలు మీ ఉద్దేశ్యమేమిటి?" సూటిగా అడిగింది.

"ఏ విషయంలో?" అడిగాను అయోమయంగా.

"అదే, నా విషయంలో" అంది.

తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాను. "నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను, పెళ్ళి చేసు కుంటాను ప్రామిస్" చేతిలో చేయివేస్తూ చెప్పాను.

మెరుపు'లాంటి నిర్మల కళ్ళలో మరో వింత మెరుపును చూశాను ఆ రోజు.

ఆ తరువాత నిర్మల కాస్త 'నిమ్మా' అయింది పుస్తకాలకోసం నిమ్మా రాకపోకలు ఎక్కువయ్యాయి. మా చనువు కాస్త పెరిగినమాట వాస్తవమే గానీ, కాని పని ఎన్నడూ చేయలేదు మగవాడిగా నా మనసు తొందరపడినా నిర్మల ఎప్పుడూ ఆ అవకాశం యిచ్చేదికాదు. 'తాళిగట్టిన తరువాతే'నని చిరు కోపంతో మందలించేది.

అన్నీ సవ్యంగా జరిగివుంటే ఆరునెలల్లో మా పెళ్ళి జరిగివుండేదే బహుశా అప్పుడు మీకు యీ కథ చెప్పవలసిన అవసరం కూడా వచ్చేదికాదు

ఒకరోజు నేను మేడమీద కెళ్ళేటప్పటికి అక్కడ నిర్మల వుంది రోడ్‌మీద వెళ్తున్న బస్సులో ఎవరికో 'టాటా' చెబుతోంది. బహుశా మిత్రురాలనుకున్నా బస్సెళ్ళిపోయిన తర్వాత యిటు తిరిగి నన్ను చూసిన నిర్మల ఉలిక్కిపడింది 'ఎంతసేపయింది వచ్చి?' అడిగింది తత్తరపాటుగా. 'ఇప్పుడే వచ్చా'నన్నాను ఏమీ తొణక్కుండా ఆ సాయంత్రమంతా ఏమిటో బెరుగ్గా, అన్యమనస్కంగానే మాట్లాడింది

నాకు రాకూడని అనుమానం రానే వచ్చింది తప్పు చేయని మనుషులు ఎప్పుడూ కంగారుపడరు ఆ తరువాత రహస్యంగా నిర్మలను పరిశోధించాను నా అనుమానం నిజమేనని తేలింది బస్‌లో ప్రతి రోజూ వెళుతున్న ఓ యువకుడికి నిర్మల వీడ్కోలు చెబుతోంది. అతగాడు హిందీ సినిమా హీరోలా వుంటాడు ఉన్నమాట చెప్పాలంటే నామీద చాలా బావుంటాడు

నిర్మల మా యింటికి రాకపోకలను బొత్తిగా తగ్గించేసింది ఏదైనా అవసరంవుంటే సరాసరి అమ్మతోనే మాట్లాడుతోంది నా గుండెల్లో బడబాగ్ని రగిలింది, అగ్నిపర్వతాలు ప్రేలాయి నేను చేసిన తప్పేమిటి? ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటా నన్నాను అదే నేను చేసిన తప్పా? ఒకవేళ నేనేదైనా తప్పుచేస్తే చెప్పొచ్చుగా? పోనీ నా మీద తనకిష్టం పోయిందని చెప్పొచ్చుగా

మొత్తంమీద స్త్రీ బుద్ధి చంచలం అన్పిం చింది మగవాడికి మనసనేది ఉండదనుకుంటారు.

నిర్మలను ఎంత అసహ్యించుకోందామనుకున్నా అది నా శక్తికి మించిన పనే అవుతోంది. ప్రేమించిన హృదయం ద్వేషించనంటోంది అంతేకాదు, తన ప్రేమను చంపుకోలేనని మారాం చేస్తుంది మనసును చంపుకోలేక నాలుగైదుసార్లు నిర్మలను పలుకరించాను. చాలా ముక్తసరిగా మాట్లాడింది కారణమేమిటని నిగ్గదీసి అడిగాను మాట్లాడకుండా పారిపోయింది. ఇప్పుడు నిర్మల మెరుపులా లేదు పురుములా వుంది.

ఆ రోజు నిర్మల యింట్లో వాళ్ళంతా పెళ్ళికి వెళ్ళారు అదే పెళ్ళికి మా అమ్మగారు కూడా నిర్మల తల్లి బలవంతంమీద వెళ్ళారు ఆ యింట్లో నిర్మల ఒంటరిగావుంది ఈ యింట్లో నేనూ ఒంటరిగానే వున్నాను. ఆ రోజున అటో యిటో తేల్చేద్దామని నిర్మల యింటికి బయలుదేరాను.

గుమ్మం దగ్గరకు వెళ్ళేసరికి ఏవో మాటలు విన్పించాయి నిర్మల గొంతుతోబాటు ఓ మగ గొంతు విన్పిస్తోంది. తలుపు తట్టకుండా వెనక్కు తిరిగి, మళ్ళీ కుతూహలం చంపుకోలేక తలుపు సందులోంచి చూశాను

ఘోరం! ఆ దృశ్యం మీకు చెప్పలేను నిర్మల– అతనూ, ఒకరి కౌగిలిలో ఒకరు ఎన్నో నీతులు నాకు నూరిపోసిన నిర్మల బరితెగించి తన యింటిలోనే పరాయి పురుషునితో

భగవాన్, నా గుండెల్లో ప్రబద్ధలయిన అగ్ని పర్వతాల్లోంచి వుబికివచ్చే లావా కన్నీళ్ళుగా మారి ప్రవహిస్తుంది ఎంతో గాఢంగా ప్రేమించాను ఇప్పుడు ప్రేమించిన పడతిని మరచి బ్రతుక గలనా? చెప్పండి మీరే చెప్పండి?

# నిర్మల

కన్నెవయసు పిల్ల తన క్కాబోయే భర్తలో ఏమేమి వుండాలని కలలు కంటుందో అవన్నీ సమ పాళ్ళలో వున్నాయి ప్రభాకర్‌లో అతనితో అయిదు నిమిషాలు మాట్లాడిన తర్వాత మనసు పారేసు కోకుండా మరలి రావడం ఏ కన్నెపిల్లకూ సాధ్యం కాదని నా అభిప్రాయం! అలాంటి ప్రభాకర్ నా 'ప్రభు' అవుతానని అన్నప్పుడు నేను పొందిన మధురానుభూతి వర్ణనాతీతం ఆ రోజు కోసం క్షణాలు లెక్కబెట్టుకొనేదాన్ని ప్రభు మాటలు, చిలిపి చేష్టలు, తుంటరి తూపులు నన్నెంత అల్లరి పెట్టేవంటే, ఒక్కసారిగా యీ సాంప్రదాయపు కట్టుబాట్లను తెంచుకొని 'చలం మైదానం'లో

ప్రభుతో కాపురం పెట్టేద్దామనిపించేది అయినా అంత సాహసం నా వయసుకువున్నా, మనసుకులేదు

ప్రతి నాణానికి బొమ్మా—బొరుసూవుంటాయి ప్రతి బట్టకు ఉల్టా—సీదా వుంటుంది ప్రతిరోజుకూ పగలు—రేయి వుంటాయి అలాంటప్పుడు 'నిర్మల' జీవితంలోమాత్రం ఎప్పుడూ సౌఖ్యమే ఎందుకుండా లనుకుంది విధి అందుకే నా జీవితాన్ని క్రూరంగా కాటువేసింది

మా భరతనాట్య బృందంలో నాతోబాటు ఇంకా ఆరుగురు అమ్మాయిలున్నారు. అందులో సరళకు నాకూ మంచి స్నేహం ఇటీవలే సరళకు వివాహం కూడా జరిగింది. ఆరోజు ఓ ప్రోగ్రామ్ విషయమై మాట్లాడటానికి అర్జంటుగా సరళ యింటికి వెళ్ళాను తీరా యింటికి వెళ్ళేసరికి సరళ యింట్లో లేదు వాళ్ళ అమ్మమ్మకు సీరియస్‌గా వుందని టెలిగ్రామ్ వస్తే వెళ్ళిందట! సరళ భర్త శ్రీపతి సాదరంగా ఆహ్వానించాడు. ఆ యింట్లో కూర్చోవడం నాకు క్రొత్త కాకపోయినా, సరళ లేకుండా కూర్చోవడం మాత్రం ప్రథమమే!

శ్రీపతి మంచి స్థితిపరుడు. సరళను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు మ్యారేజిలో పరిచయమవ్వడమే గాక ఆ తరువాత కూడా నాలుగైదుసార్లు సరళ యింటికి వెళ్ళినప్పుడు కలసి మాట్లాడిన పరిచయం వుంది.అందుకేఆయనఆహ్వానాన్ని కాదనలేకపోయాను

మేమిద్దరం లోకాభిరామాయణం మాట్లాడు కుంటూండగానే ఉరుములు మెరుపులతో పెద్దవర్షం వచ్చేసింది అకస్మాత్తుగా ప్రారంభించిన వర్షం కుంభవృష్టిగా మారింది నా మనస్సులో ఆందోళన ప్రారంభమయింది ఈ వర్షంలో ఒంటరిగా ఎలా యింటికి చేరడం? భగవంతుడా, ఏమిటీ వైపరీత్యం? నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి

నా పరిస్థితి గమనించిన శ్రీపతి చిన్నగా నవ్వి 'వర్షం తగ్గేలాలేదు మీరేమీ అనుకోకపోతే యీ పూటకు యిక్కడ విశ్రమించండి' అన్నాడు

'లేదండీ వెళ్ళిపోవాలి లేకపోతే యింటిదగ్గర అమ్మ కంగారు పడుతుంది' అన్నాను కంగారుగా.

'మీరు మరీ గాభరా పడకండి వర్షం ఉధృతం కొంచెం తగ్గనివ్వండి. ఏ టాక్సీలోనైనా స్వయంగా మిమ్మల్ని డ్రాప్‌చేసి వస్తాను' అనునయంగా అన్నాడు శ్రీపతి.

నా మీద పగబట్టినట్లుగా వర్షం ఉధృతంగా కురుస్తూనే వుంది. సోఫాలో కూర్చొని మాట్లాడుతూనే నిద్రాదేవి ఒడిలోకి వాలిపోయాను

సమయం ఎంత గడిచిందో తెలియదు. హఠాత్తుగా త్రుళ్ళిపడి లేచాను నా ప్రక్కన శ్రీపతి నా మీదకు ఆత్రంగా వంగుతున్నాడు

జరగబోయేదేమిటో తెలుసుకునేటప్పటికి సమయం మించిపోయింది శ్రీపతి పశు బలం ముందు నా ప్రతిఘటన వీగిపోయింది ఆ రాత్రి నా జీవితంలో కాళరాత్రి అయింది

నా జీవితంలా ఆ రోజు తెల్లవారింది. ఇంటికి వచ్చాను. ప్రభు కన్పించాడు చిరునవ్వుతో నిష్కల్మషమైన ఆ నవ్వును చూడగానే నా వంటిపై తేళ్ళు, జెర్రులూ ప్రాకినట్లనిపించింది ఏడవలేక నవ్వుతూ లోపలకు నడిచాను

నా జీవితంలో ఎన్నడూ, ఎవర్నీ ప్రేమించ నంతగా 'ప్రభు'ని ప్రేమించాను అందుకే ప్రభాకర్‌ను మోసం చేయలేననిపించింది ఈ అపవిత్రమైన శరీరంతో ప్రభాకర్‌ను సుఖబెట్టలేను అసలు ప్రభాకర్ మొఖంలోకే సూటిగా చూడలేక పోతున్నాను ఊహూం. లాభంలేదు. ప్రభాకర్‌ను చేబట్టి అతని జీవితం కలుషితం చేయడం నా వల్ల కాదు ఎలాగైనా ప్రభాకర్‌కు దూరం కావాలి ఎలా? ఎలా?

ఆలోచించగా నాకు ఒకే ఒక్క ఉపాయం తట్టింది ప్రభాకర్ తనకు తానుగా నన్ను అసహ్యించుకోవాలి ఆ విధంగానైతేనే అతన్ని పాప పంకిలంలో పడకుండా రక్షించిన దాన్నవుతాను

వెంటనే ప్రణాళికను అమలుజరిపాను నా కోసం అర్రులు చాచే ఓ కుర్రాడిని ఉపయోగించు కున్నాను అయితే అది అతనికి అసహ్యంగాక ఆగ్రహం కలిగించిందని గ్రహించడానికి ఎంతోకాలం పట్టలేదు చివరకు మలినమయిన నా జీవితాన్ని అతనికి బహిర్గత పరచయినా అతనికి నాపై అసహ్యం కల్గించాలని నిర్ణయించుకున్నాను అయితే ఆ పథకం ప్రభాకర్‌పై మరో విధంగా పనిచేసింది ప్రభాకర్ దేవదాసు అయిపోయాడు ఇటు శీలం కోల్పోయి, అటు ప్రియుడి పతనాన్ని కళ్ళారా చూస్తూ యింకా యీ బొందెలో ప్రాణాలెలా నిలచివున్నాయో, ఎందుకు నిలచివున్నాయో అర్థం కావడంలేదు. కనీసం నేను మరణిస్తేనన్నా ప్రభాకర్ ఒకదారికి వస్తాడేమో?

## రచయిత

ప్రభాకర్, నిర్మల ప్రణయగాథకు చరమాంకం నేను వ్రాయవలసి వస్తుందని కలలో గూడా అనుకోలేదు ప్రతి నాణానికి బొమ్మా—బొరుసూ వుంటాయి ప్రతి బట్టకు వుల్టా—సీదా వుంటాయి ప్రతిరోజుకు పగలూ—రేయి వుంటాయి ఈ క్రియలలో రెండూ కలిస్తేనే సంపూర్ణత్వం అయితే గమ్మత్తేమిటంటే వీటిలో ఏ ఒక్కటీ గూడా రెండవ దానిని దర్శించ లేవు అదే పరిస్థితి ప్రభాకర్—నిర్మలమధ్య ఏర్పడింది ఇరువురూ మనసున్న మనుషులే! అందుకే తమ తమ మనసులను మభ్యపెట్టుకోలేకపోతున్నారు. ప్రభాకర్ తన ప్రేమను నిర్మల గుర్తించలేదని బాధపడితే, అపవిత్రమైన తనను ప్రభాకర్‌కు అర్పించుకోలేక మథనపడుతోంది నిర్మల

అయితే అదృష్టవశాత్తూ యీ ఇరువురూ తమ కథలను నాకు చెప్పినప్పుడు నేనెంతో ఆనందించాను బొమ్మా—బొరుసుల నొకదాని నొకటి దర్శించుకునేలా చేద్దామనుకున్నాను ఉల్టా సీదాలను కలిపేద్దామనుకున్నాను పగలూ రేయిని ఏకంచేసే ప్రముఖుడ్ని అవుదామనుకున్నాను అవును అలా అనుకోవడంలో తప్పేముంది నిర్మల విషయంలో జరిగినదొక పీడకల అందులో నిర్మల ప్రమేయమేమీ లేదు. అయితే ప్రభాకర్‌ను గాఢంగా ప్రేమించడం వలన ఈ విధమైన బాధ ననుభవిస్తోంది అసలు విషయం ప్రభాకర్‌కు తెలిస్తే నిర్మలను తప్పక నిండుహృదయంతో స్వీకరిస్తాడు ప్రభాకర్ ప్రేమలో ఆ త్యాగం వుందని నాకు తెలుసు అందుకే మరుసటి రోజే ప్రభాకర్‌ను పిలచి 'అసలు విషయం' చెబుదామని నిర్ణయించుకొని ఆ రాత్రి గాఢంగా నిద్రపోయాను అయితే బొమ్మా—బొరుసూ ఒకదానినొకటి చూడలేవని తెల్లవారిన తరువాతనే తెలిసింది, కాదు స్పష్టమయింది

అదేరాత్రి ఒకరి కొకరు తెలియకుండానే యిరువురూ స్లీపింగ్ పిల్స్ మ్రింగి అమరలోకాని కెగిరిపోయారు జంటగా!



